క్లుప్తంగా

ఆంజనేయస్వామికి అభిషేక పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను చేపట్టారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కౌతాళంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిది



స్కూల్ అసిస్టెంట్ భారతి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోసిగి: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిదని, విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి నప్పుడే గుర్తిండిపోతారని ఎంఈఓ శోభారాణి, కోసిగి బాలుర హైస్కూల్ హెచ్ఎం ఖలీల్ అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) భారతి పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువా పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జంపాపురం హైస్కూల్ హెచ్ఎం బందేనవాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు కోరారు. శనివారం ప్రమాద రహిత దినోత్సవం (ప్రతి మూడో శనివారం)లో భాగంగా పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు, ఆలూరు రోడ్డు వద్ద ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, దాని వల్ల కలిగే పర్యావసనాలు, ఓవర్‌లోడ్, రైడింగ్, సీటుబెల్టు ప్రాముఖ్యత తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

బాలికలు జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ బృందం నాగన్న

కోసిగి: బాలికలు, మహిళలు అఘాయిత్యాలు, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎమ్మిగనూరు శక్తి టీమ్ బృందం నాగన్న సూచించారు. శనివారం స్థానిక మౌంట్ కార్మెల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్, ఫాదర్ జిజోల ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో, గుర్తు తెలియని వ్యక్తులు దాడులకు పాల్పడుతున్నారని ముందస్తుగానే పసిగట్టి వారి నుంచి కాపాడుకునేందుకు శక్తి టీమ్‌కు లేక 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. వెంటనే ప్రమాద ప్రమాదానికి పోలీసులు చేరుకుని రక్షించించే ప్రయత్నం చేస్తారన్నారు.

'రన్ ఫర్ జీసస్' ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు, పాస్టర్లు

ఆదోని సెంట్రల్: గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని పాస్టర్ కోలా విజయరాజు ఆధ్వర్యంలో పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విక్టోరియాపేట సీఎస్ఐ చర్చి నుంచి శ్రీనివాసభవన్, భీమా సర్కిల్, ఎమ్మిగనూరు సర్కిల్ మీదుగా కేథలిక్ చర్చి బాలయేసు ప్రార్థనా మందిరానికి చేరుకున్నారు. వారు మాట్లాడుతూ సాటి మానవుడి పట్ల ఆప్యాయత కలిగి ఉండాలని ప్రభువు చెప్పాడన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల పాస్టర్లు, సంఘం పెద్దలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

సర్వేలతో సతమతం

- కూటమి సర్కారు అనాలోచిత నిర్ణయం
- పంచాయతీ కార్యదర్శులపై పెనుభారం
- వివిధ రకాల సర్వేలతో పాటు పన్ను వసూళ్ల బాధ్యతలు
- మానసిక వేదనకు గురవుతున్న వైనం



పనిభారం, ఒత్తిడి తగ్గించాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు(ఫైల్)

గోనెగండ్ల : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనాలోచిత చర్యలు, నిర్ణయాలకు గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు మానసిక వేదన, తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పనిభారం పెంచి టార్గెట్‌లు విధించి జిల్లా మండల స్థాయి అధికారుల ద్వారా తీవ్రంగా వేధిస్తుండడంతో కార్యదర్శులు హడలిపోతున్నారు.

ప్రతి దానికీ పంచాయతీ కార్యదర్శులే జవాబుదారీ..

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను జవాబుదారీగా చేస్తూ మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయీస్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోం, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, పీ 4 సర్వే, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, పీఏసీఎస్ సర్వే, లేధర్ ఆర్డినెన్స్ సర్వే, 0–6 ఏళ్ల పిల్లల ఆధార్ మిస్సింగ్ సర్వే, నాన్ ఏపీ రెసిడెన్స్ సర్వే, ఇంటి పన్నులు, కుళాయి పన్నుల వసూళ్లు తదితర పనులను అంటగడుతున్నారు. ఆయా సర్వేలపై ఐవీఆర్ కాల్స్ ప్రజాభిప్రాయాలు సేకరించి, చిన్న విషయానికి కూడా కార్యదర్శులను వివరణలు అడుగుతుండటంతో సతమతమవుతున్నారు. అంతిమంగా ఈ పనిభారం మొత్తం ప్రోగ్రెస్ రూపంలో పంచాయతీ కార్యదర్శులపై పడి వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు తము ఎదుర్కొంటున్న అధిక పని భారం, పని ఒత్తిడి నుండి ఉపశమనం కల్పించాలని ఇటీవల ఎంపీడీఓలకు వినతిపత్రాలు కూడా అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శులకు పని భారం, ఒత్తిడిని తగ్గించాలని కార్యదర్శులు కోరుతున్నారు.

జాబ్‌మేళాలో 155 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్‌రాజ్ కుమార్

ఆదోని రూరల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 155 మంది ఉద్యోగాలకు ఎంపికై నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌రాజ్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివిధ కార్పొరేట్ కంపెనీలు హాజరై ఉద్యోగ మేళాలో 305 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఇందులో 155 మంది తమ నైపుణ్యాలను ప్రదర్శించి ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికై న అభ్యర్థులకు రూ.12 వేల నుంచి రూ.24 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్, కరస్పాండెంట్ దైవాధీనంరెడ్డి, స్కిల్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయితేజ పాల్గొన్నారు.

మున్సిపల్ విద్యా వ్యవస్థను పునర్నిర్మించాలి

ఆదోని సెంట్రల్: అర్బన్ ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడి నిలదొక్కుకుని మనుగడ సాగిస్తున్న మున్సిపల్ విద్యా వ్యవస్థను పునర్నిర్మించాలని ఏపీ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాఠశాలలో ఏపీ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, పట్టణశాఖ అధ్యక్షులు అనిల్‌కుమార్‌లు మాట్లాడుతూ 117 ఉత్తర్వుల్లోని మూడు కి.మీ. పరిధి నిబంధనల వల్ల మున్సిపల్ పాఠశాలలకు నష్టం జరుగుతుందన్నారు. ఇలాంటి చర్యలను నివారించి దశాబ్దం కిందటే అప్‌గ్రేడ్ అయినా అమలుకు నోచుకోని మున్సిపాల్ పాఠశాలలకు స్టాఫ్ ప్యాట్రన్ ప్రకారం ఈసారైనా పాఠశాల సహాయకులు మరియు హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగం బసవరాజు, కోటన్న, చంద్రమౌళి, నూరుల్‌హక్, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై పెల్లుబికిన ఆగ్రహం



పట్టణంలోని సోమప్ప సర్కిల్ వద్ద ర్యాలీలో భారీగా పాల్గొన్న ముస్లింలు



పట్టణంలో వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: వక్ఫ్ చట్ట సవరణపై ఎమ్మిగనూరు పట్టణంలో ముస్లింలలో ఆగ్రహం పెల్లుబికింది. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శనివారం స్థానిక జామియా మసీదు ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. వేలాది మంది ముస్లింలు జామియా మసీదు నుంచి మండుటెండలో ర్యాలీలో పాల్గొని వక్ఫ్ బిల్లుకు మద్దతిచ్చిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై మండిపడుతూ నినాదాలు చేశారు. కాగా, ఎమ్మిగనూరులో మొట్టమొదటి సారి ముస్లిం మహిళలు సైతం వందలాది మంది తరలివచ్చి వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక షరాఫ్ బజార్, గాంధీ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌కు అందజేశారు..

వక్ఫ్‌బోర్డ్‌లో అన్యమతస్తులను చేర్చుతారా?

ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా వక్ఫ్‌బోర్డ్‌లో అన్యమతస్తులను చేర్చేలా చట్ట సవరణ ఎలా చేస్తారని ముస్లిం మత పెద్దలు యుసుఫ్ మౌలాన, మౌలానా అతావుల్లా, సీఫతులా మౌలాన, మౌలాన ఖైరుల్లా బేగ్, ఖాశింబేగ్, రసూల్, అల్లావుద్దీన్, సయ్యద్‌చాంద్, ఇమ్రాన్, వాహిద్ పాటు పలువురు ముస్లిం, మత పెద్దలు మండిపడ్డారు. వక్ఫ్ బోర్డ్ పరిధిలో వున్న ఆస్తులు ముస్లింలవి వాటిపై మీపెత్తనం ఏమిటని వారు ప్రశ్నించారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు బీహార్ సీఎం నితీష్‌కుమార్‌లు మద్దతు ఇవ్వడంతో ముస్లింలకు ద్రోహం చేసినట్లు అయ్యిందన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసేవరకు తమ పోరాటం ఆగదన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ అన్నారు. శనివారం పట్టణంలోని సబ్‌జైలును తనిఖీ చేశారు. జైలులోని ఖైదీల వివరాలను, వారికి అందుతున్న సేవలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడానికి వచ్చే వారికి కల్పించే సదుపాయాలను పరిశీలించారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్, జైలు అధికారులు పాల్గొన్నారు.

గుడికల్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు



గుడికల్ చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే గుడికల్ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క మొక్కలు, మొక్కల వ్యర్థాలతో నీరు కలుషితమవుతుండటంతో వాటి తొలగింపు పనులను శనివారం చేపట్టారు. పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. అదేవిధంగా నీటి నిల్వకోసం ఎల్లెల్సీ వద్ద క్రాస్ బండ్ పనులను పరిశీలించి ఇంజినీరింగ్, నీటి సరఫరా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఈలు శరత్ చంద్ర, మదన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలకు కు.ని ఆపరేషన్లు

పట్టణంలో పెరిగిపోతున్న కుక్కలను అరికట్టేందుకు గాను ఆదోని రోడ్డులో ఉన్న పశువుల ఆస్పత్రిలో కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సకై చేపడుతున్న పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. పట్టణంలో పట్టుకున్న కుక్కలను పశువుల ఆస్పత్రికి చేర్చి అక్కడ ఏర్పాటు చేసిన బోన్లలో వుంచి సురక్షితంగా కు.ని శస్త్ర చికిత్సలు చేసి వ్యాక్సిన్లు వేసి వదిలివేస్తామన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

కౌతాళం: ఆకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్నలు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం వచ్చిన ఆకాల వర్షం వల్ల మండలంలోని మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు గ్రామాల్లో కొతకు వచ్చిన వరిపంటతో పాటు వరి పంటను కొసి కల్లాల్లో ఉంచిన ధాన్యం తడిసి ముద్దయ్యిందన్నారు. శనివారం ఆయా గ్రామాల పర్యటించి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇప్పటికే ఈ ఏడాది ధర లేక మిరప పంట వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని ఇక పత్తి పంట వల్ల కూడ దిగుబడి లేక నష్టపోయారని తెలిపారు.

బాలిక అదృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని మదిరె గ్రామానికి చెందిన పద్నాలుగేళ్ల బాలిక అంజలి అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు కాత్రికి పార్వతి, కాశీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్ శనివారం తెలిపారు. ఈనెల 17వ తేదీన ఇంటి నుంచి తమ కుమార్తె వెళ్లిపోయిందని, తెలిసిన వారి వద్ద విచారించగా ఆచూకీ లభించలేదని, బంధువులకు కూడా ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా ఫలితం లేదన్నారు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారని ఎస్ఐ చెప్పారు.

స్థలం విషయంలో ఘర్షణ

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో ఇంటి పక్కన ఉన్న స్థలం విషయంలో పక్కపక్కనే ఉన్న ఇరు కుటుంబాల సభ్యులు ఘర్షణ పడిన ఘటనలో ఇరువురికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. శనివారం గ్రామానికి మాలదాసరి అంజినయ్య, తలారి తిమ్మప్ప కుటుంబ సభ్యుల మధ్య స్థలం విషయంలో జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. ఇందులో మాలదాసరి అంజినయ్యకు తీవ్ర రక్తగాయాలు కావడంతో కోసిగి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంత రెడ్డి తెలిపారు.



అశేష భక్తు జనుల మధ్య సాగుతున్న రథోత్సవం

రమణీయం.. భీమరాయస్వామి రథోత్సవం



భీమరాయస్వామి మొక్కులు తీర్చుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో వ్యాసరాయులచేత ప్రతిష్టించబడి, కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా విరాజిల్లుతున్న భీమరాయస్వామి రథోత్సవం శనివారం రమణీయంగా సాగింది. ఆలయ అర్చకులు నాగరాజు స్వామి ఉదయం గణపతి పూజ, లింగార్చన, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, మహా మంగళహారతులు చేపట్టారు. జాలవాడి గ్రామంతో పాటు కంబలదిన్ని గ్రామస్తులు స్వామివారికి పిండి పదార్థాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం గంగా నాగప్ప తాత ఇంటి నుంచి ఉత్సవ మూర్తిని గుడి వద్దకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై అధిష్టించారు. రథం ముందు గుమ్మడికాయతో బలిదానం ఇచ్చి, మహా మంగళహారతుల వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం శ్రీరామ నామ ధ్వనుల మధ్య రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ రథోత్సవం ప్రధాన రహదారి వద్ద ఉన్న బసవన్న కట్టదగ్గరికి లాగి యధాస్థానానికి చేర్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, సర్పంచ్ యర్రకోట మల్లమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు బసన్న, శివ, ఆంజనేయులు, ఉసేని, రామన్న, కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

యువత క్రీడల్లో రాణించాలి



విజేత జట్లకు ట్రోఫీలను అందజేసిన ఆర్గనైజర్లు

ఆదోని రూరల్: గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు పరమేష్, సిద్ధప్ప అన్నారు. శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి, శుభ శుక్రవారాన్ని పురస్కరించుకుని కేవీపీఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. పోటీల్లో 20 టీంలు పాల్గొనగా.. మొదటి బహుమతిని సాదాపురం జట్టు, రెండో బహుమతి సంతెకూడ్లూరు జట్టు కేవసం చేసుకున్నాయి. వీరికి గ్రామ నాయకుడు భీమేష్, స్థలదాత ఉల్లిగడ్డ శంకరప్పల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: కార్మిక వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు గోవర్ధనమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రంగన్న, నాగరాజు, నాగలక్ష్మి, శైలజ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ఎమ్మిగనూరుటౌన్: అగ్నిప్రమాదాలు సంభవిస్తే వాటిని అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి జి.రామాంజనేయులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని శిల్పా ఆసుపత్రి ఆవరణలో అగ్నిప్రమాదాలు, వంటగ్యాస్ లీకై మంటలు వ్యాపిస్తే వాటిని ఎలా అదుపు చేయాలన్నదానిపై వైద్యురాలు శిల్ప, సిబ్బందికి ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక సిబ్బంది ఈరన్నగౌడ్, నాగరాజు, గోపాల్, సర్దార్‌బాషా, మహబుబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి

ఆదోని టౌన్: పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీ రహదారిలో కల్వర్టు దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతు పనులు చేయాలని కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ అధికారులను కోరారు. శనివారం ఆయన దెబ్బతిన్న కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిజాముద్దీన్ కాలనీ పరిధిలోని ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిందన్నారు. దీంతో వాహనాల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయన్నారు. ఈ విషయాన్ని కమిషనర్, మున్సిపల్ ఇంజినీర్‌కు తెలియజేశామన్నారు.

స్వచ్ఛతకు అందరి భాగస్వామ్యం అవసరం



ఎమ్మిగనూరులో విద్యార్థులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే బీవీ



పంచాయతీ అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ భాస్కర్



పెద్దకడబూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ శ్రీవిద్య

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ స్వచ్ఛతకు అందరి భాగస్వామ్యం అవసరమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ సోమప్ప సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు కొనసాగింది. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి విద్యార్థులు, ఉద్యోగులతో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థినులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయరాణి, ఎన్ఎస్ఎస్ అధికారి హరికుమార్, అధ్యాపకులు పద్మావతి, లక్ష్మీస్రవంతి, కావ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఈ– వ్యర్థాలు పర్యావరణానికి హానికరం

గోనెగండ్ల : ఈ– వ్యర్థాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని ఎంపీడీఓ మణి మంజరి అన్నారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో స్వర్ణంధ్ర–స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయ పరిసరాల్లో ఈ -వ్యర్థాల సేకరణను అధికారులు చేపట్టారు. ఎలక్ట్రానిక్ వస్తువులు ఇంట్లో వాడకుండా నిరుపయోగంగా ఉంటే వాటిని తీసుకువచ్చి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, పంచాయతీ ఈఓ సతీష్, సర్పంచ్ హైమవతి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నందవరం : పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఎస్ఐ ఎం. కేశవ అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్టేషన్ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అలాగే మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, ఉప సర్పంచ్ శివారెడ్డి గౌడ్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీపీఓ భాస్కర్ హాజరయ్యారు. అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం వరకు ర్యాలీ చేపట్టారు. మానవహారం, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శివరామ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఆదోని రూరల్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని డీపీఓ భాస్కర్ అన్నారు. మండలంలోని మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగాంగా వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యివ్వాలి

ఆదోని అర్బన్: ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ లోపల, బయట పరిసర ప్రాంతాలను చీపుర పట్టి శుభ్రం చేశారు.

స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రకు కృషి చేయాలి

పెద్దకడబూరు : స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్మికులతో పాటు ప్రజలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ జయరాముడు ఆధ్వర్యంలో శనివారం రోడ్లును శుభ్రం చేశారు. అలాగే ఇంటిని, వీధులను, గ్రామాన్ని, మండలాన్ని శుభ్రంగా ఉంచుకుందామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజినేయులు, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, ఎంపీడీఓ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురజాల క్షేత్రంలో రంజి ప్లేయర్



గురజాల రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న రంజి క్రికెట్ ప్లేయర్ అభిమన్యు మిథున్

నందవరం : దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రాన్ని రంజి క్రికెట్ ప్లేయర్ అభిమన్యు మిథున్ సందర్శించారు. శనివారం గురజాల క్షేత్రంలో అభ్యుమను మిథున్ ఆది దంపతులు(రామ లింగేశ్వర స్వామి, పార్వతీ దేవి) దర్శించుకుని పంచామృతాభిషేకాలు గావించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అర్చకులు హంపేష్ స్వామి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. పూజల అనంతరం స్వామి వారి జ్ఞానపికతో పాటు తీర్థ ప్రసదాలు అందజేశారు. ప్రస్తుతం మిథున్ కర్ణాటక టీమ్ నుంచి రంజి మ్యాచులు ఆడుతున్నాడు. ఆయన వెంట మంత్రాలయం ఫిజికల్ డైరక్టర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com